క్లుప్తంగా

విజయదుర్గ ఆలయంలో పూజలు



వేట్లపాలెంలో విజయదుర్గ అమ్మవారిని దర్శించుకున్న దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు సోమవారం వేట్లపాలెంలోని విజయదుర్గ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. గ్రామంలో వేంచేసి యున్న ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో దొరబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మాకిరెడ్డి రాంబాబు, జక్కా మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై వెంకటేష్ సూచించారు. ఉప్పాడ- కాకినాడ బీచ్‌రోడ్డులో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో ఎక్కువగా యువతే బలవుతున్నారు. దీనికి ప్రధాన కారణం మద్యం, మత్తు పదార్థాలు తీసుకోవడమే అన్నారు. తీరప్రాంతాల్లో సేద తీరే పర్యాటకులు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. పలువురు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పాదగయను దర్శించిన దేవాదాయ శాఖ కమిషనర్



పాదగయ క్షేత్రంలో పండితుల ఆశీర్వచనాలు పొందుతున్న కమిషనర్ దంపతులు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రాన్ని సోమవారం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. ఉమాకుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు, అష్టాదశ శక్తిపీఠాల్లో పదో పీఠమైన పురుహితికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం, శిష్టికరణాల వీధిలో ఉన్న పురూహూతికా అమ్మవారి ఆలయాలను దర్శించారు. ఆయన వెంట పలువురు దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ఉన్నారు.

జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో చోరీ

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో చోరీ జరిగిన సంఘటనను సోమవారం ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ నెల 3 నుంచి దసరా సెలవులు కావడంతో ఆదివారం వరకు పాఠశాలను మూసి వేసి ఉంచారు. పాఠశాల నూతన భవన నిర్మాణ పనులకు గానూ విద్యుత్తు పనులకు సంబంధించిన కాపర్ వైర్‌ను పాఠశాల ఆవరణలో ఉంచారు. సుమారు రూ.15వేలు విలువ చేసే ఈ కాపర్ వైర్ కనిపించక పోవడంతో చోరీకి గురి అయిన్నట్లుగా నిర్ధారణకు వచ్చినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు హనుమంత్ తెలిపారు. చోరీ సమయంలో పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాలచర్ల అబ్బాయి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామానికి చెందిన పాలచర్ల అబ్బాయి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గక కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే రాఘవరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోతులు.. రాకపోకలకు వెతలు

- నరక ప్రాయంగా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ప్రయాణం
- అంతంతమాత్రంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ
- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- గోతులు పూడ్చాలని స్థానికుల వినతి



కెనాల్ రోడ్డు బ్రిడ్జి దిగువ భాగంలో ఏర్పడ్డ భారీ గోతులు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు పడిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రారంభం నుంచి చివరి వరకు బ్రిడ్జి గోతులమయంగా మారిపోయింది. దీనికి తోడు బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు బాగా పెరిగింది. గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు మీదుగా కాకినాడకు వాహనాల రాక పోకలు జరిగేవి. అయితే ప్రస్తుతం కేవలం మోటారు సైకిళ్ల మాత్రమే రాక పోకలు జరిగే విధంగా రైల్వే గేటుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహన చోదకులంతా ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగానే రాక పోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో భారీ వాహనాలు బ్రిడ్జిపై నుంచి ప్రయాణించే సమయంలో మిగిలిన వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కెనాల్ రోడ్డు వాహనాలు సైతం ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగానే..

కాకినాడ నుంచి ధవళేశ్వరానికి రాకపోకలు సాగించే వాహనాలు సైతం ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగానే రాకపోకలు చేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలం అవుతోంది. బ్రిడ్జి దిగువ భాగంలోని కెనాల్ రోడ్డు మాండవ్య నారాయణస్వామి ఆలయానికి వెళ్లే కాలిబాట వంతెన వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రతీ ఒక్కరూ బ్రిడ్జి మీదుగానే రాకపోకలు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకలీ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం బ్రిడ్జిపై గోతులు కారణంగా నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఉన్న పోలీసు సిబ్బంది ఇబ్బందులకు గురి అవుతున్నారు. సామర్లకోట పోలీసు స్టేషన్ జంక్షన్ కావడంతో ఇతర స్టేషన్ల కంటే ఎక్కువ మంది పోలీసు సిబ్బందిని నియమించాలి. ఉన్న సిబ్బందిలో 10 మందిని విజయవాడ బందోబస్తుకు నియమించడం సోమవారం నాటికి కూడా వారు విధులకు హాజరు కాకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎవరి ఆత్రం వారిదే...

వాహనాలు బారులు తీరిన సమయంలో ఎవరికి వారే ముందు వెళ్లి పోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనే వాదనలు ఉన్నాయి. బ్రిడ్జిపై సుమారు 50 ఏళ్ల క్రితం సింగల్ రోడ్డుగా నిర్మాణం చేశారు. వరుసగా ఒకే లైన్‌లో వెళితే ట్రాఫిక్ సమస్య ఉండదు. అయితే లైన్ తప్పించుకొని రెండవ లైనులో వెళ్లడానికి కొందరు ప్రయత్నిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. వాహన చోదకులు అవగాహన పెంచకోకపోతే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవున్నాయి. లైను తప్పించుకొని వచ్చే వాహన చోదకులపై అపరాధ రుసుము విధించడం జరుగుతుందని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అపరాధ రుసుము వసూలు చేయడం ద్వారా కొంత మేర సమస్య తగ్గుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పాటు ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశాలల్లో పోలీసు సిబ్బంది సంఖ్యను పెంచాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతుల రహదారిలో ప్రయాణాలు



ట్రాఫిక్‌జామ్‌తో బారులు తీరిన వాహనాలు

బ్రిడ్జిపై గోతులు పూడ్చాలి



స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోతులతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద వాహనాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. బ్రిడ్జిపై ఉన్న గోతులను వెంటనే పూడ్చి ప్రమాదాలను నివారించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ కళాశాలలకు చెందిన బస్సులతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జిపై కూడలి ప్రదేశాలల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించారు.

కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు



బ్రిడ్జిపై గోతుల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పట్టణ పరిధిలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల సాయంలో రెండు పర్యాయాలు గోతులు పూడ్పించాం. సమస్యను ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి గోతులను శాశ్వత ప్రాతిపదికన పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ సమస్య నివారణకు బ్రిడ్జిపై సిబ్బందిని నియమిస్తాం.

అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్సై, సామర్లకోట

పంచారామ క్షేత్రానికి భక్తుల తాకిడి



పూజలందుకున్న పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారు జామున తొలి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తొలిపూజ, అభిషేకాలను తిలకించడానికి తెల్లవారు జాము నుంచి భక్తులు బారులు తీరారు. స్వయంగా స్వామి వారికి అభిషేకాలు చేసుకొనే భక్తులు ఆలయ ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి ఆలయ కోనేరు నీటితోనూ, పాలతోనూ అభిషేకాలు చేసుకున్నారు. పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం భక్తులకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్‌లు స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



కొత్తపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: దసరా ఉత్సవాలు ముగియడంతో గ్రామాల్లో కనకదుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం సందడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవార్లను సోమవారం ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. తొలుత ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కోమరగిరి, గొర్స, యండపల్లి తదితర గ్రామాల్లోని అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి ఉప్పాడ, సబ్బంపేట తీరప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువత డ్యాన్సులతో సందడి చేశారు. కాగా పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

పైపులైన్ల లీకేజీలతో ఇక్కట్లు

పట్టించుకోని మున్సిపాలిటీ



ఈటీసీ వద్ద పైపులైన్ లీకుతో వృధాగా పోతున్న త్రాగునీరు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో గత కొన్ని రోజులుగా తాగునీరు వృధాగా పోతున్న పెద్దాపురం మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక కాకినాడ రోడ్డులో సాంబమూర్తి రిజర్వాయర్ ఐదు తూముల వద్ద నుంచి బ్రౌన్‌పేట, ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు మీదుగా పెద్దాపురంకు తాగునీటి పైపు లైన్ ఏర్పాటు చేశారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ విమల్ బాట్లింగ్ ఎదురుగా ఈటీసీ వద్ద తరచూ పైపులైనుకు లీకులు అవుతున్నాయి. వీటికి నామమాత్రంగా మరమ్మతులు చేసి వదిలి వేయడంతో తరుచూ అదే ప్రదేశంలో లీకులు ఏర్పడుతున్నాయి. ఈ లీకులు కారణంగా ఆ ప్రాంతం లోని మురుగునీరు పైపు లైన్ల లోనికి వెళ్లి తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది. పైపులైన్ లీకులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వృత్తి విద్యా కోర్సులను వినియోగించుకోండి



వృత్తి విద్యా కోర్సుల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

పెద్దాపురం: పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాండ్రకోట జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎస్‌సీ మూర్తి కోరారు. ఎన్ఈపీ-2020లో భాగంగా పీఎంశ్రీ పథకం కింద కాండ్రకోట హైస్కూల్‌లో వృత్తి విద్యా కోర్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. 9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకునేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఐటీ, ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం మూర్తి కోరారు.

మహిళలు, బాలికలకు రక్షణ కరవు

- అత్యాచారం ఘటనలో నిందితులను శిక్షించాలి
- పిఠాపురంలో సీఐటీయూ నేతల ఆందోళన



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పిఠాపురం: రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని సీఐటీయూ నేతలు అన్నారు. , ఇటీవల మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని విమర్శించారు. పిఠాపురంలో అత్యాచారనికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మైనర్ బాలిక కటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం సీఐటీయూ, రిక్షా కార్మిక సంఘం నేతలు పిఠాపురంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, రిక్షా కార్మిక సంఘం నేతలు కె.చిన్న, సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 7న మైనర్ బాలికను ఆటోలో అపహరించి మాదాపురం రోడ్డులోని డంపింగ్ యార్డ్ వద్ద జాను అనే అత్యాచారం చేశారన్నారు. అత్యాచారానికి పాల్పడిన జాన్‌తో పాటు అతనికి సహకరించిన సుబ్బలక్ష్మిలను న్యాయస్థానం కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాలికకు మెరుగైన వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, ఎస్.సత్తిబాబు. వి.వెంకట్రావు, కొల్లు రాజబాబు, లోవరాజు, రాజారావు, వీరబాబు, మణికంఠ, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



మాధవపట్నం వద్ద బోల్తా పడిన ఆటోను లేపుతున్న యువకులు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో సోమవారం ఆటో బోల్తా పడటంతో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. సామర్లకోట కృష్ణుని గుడి వీధికి చెందిన కొంత మంది మహిళలు ఆటోలో కాకినాడ బయలుదేరారు. మాధవపట్నం సమీపంలో ఎదురుగా వస్తున్న భారీ వాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లడంతో గోతిలో పడి బోల్తా పడింది. అప్పటికే ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. ఆ రోడ్డులో వెళుతున్న సామర్లకోటకు చెందిన యువకులు ఆటోను పైకి లేపి ఆటోలో ఉన్న వారిని బయటకు తీశారు. వారిలో ఒక మహిళ తీవ్రంగా గాయపడటంతో కాకినాడ ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పవర గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ 20వ తేదీ వరకూ పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండలంలో రూ.3 కోట్లతో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే ప్రగతి

సామర్లకోట: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల శ్రీనివాసు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని పవర, చంద్రంపాలెం, నవర గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపనలు చేశారు. గ్రామాల్లో డ్రైన్లు, రోడ్ల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మారుమూల గ్రామాలకు బస్సులు తిరిగే విధంగా కృషి చేస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రస్తుత వర్షా కాలంలో ఎక్కువగా మొక్కలు నాట్బాలన్నారు. కార్యక్రమాల్లో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, ఎంపీడీఓ కె హిమమహేశ్వరి, ఈఓపీఆర్డీ భైరవమూర్తి, మాజీ ఎంపీపీ ఆకునూరి సత్తిబాబు, గ్రామ నాయకుడు వీరంరెడ్డి ఆనంద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



పెద్దాపురం ఏడీబీ రోడ్డులో డివైడర్‌ను ఢీకొన్న కారు

పెద్దాపురం: స్థానిక ఏడీబీ రోడ్డులో ప్రమాదవశాత్తూ కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న కారు సోమవారం ఉదయం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

తీరంలో అలజడి




దానవాయిపేట సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. మండలంలోని అద్దరిపేట నుంచి కొత్తపోడిపల్లిపేట వరకూ ఉన్న తీరంలో అలలు రెండు మీటర్ల వరకూ ఎగసి పడుతున్నాయి. తుపానుపై తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్టు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరావు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లను దగ్గరలోని సురక్షిత తీరాలకు చేర్చాలని సమాచారం అందించామన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

ఇటీవల కురిసిన కుండపోత వర్షాలు, వరదల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదల నుంచి తేరుకోకముందే మళ్లీ తపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే పంటలు మునిగి దెబ్బతిన్నగా మెట్ట, పల్లపు ప్రాంతాల్లో పంటలన్నీ తెగుళ్లబారిన పడ్డాయి. వాటిని రక్షించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ తుపాను ప్రభావానికి గురైతే తీవ్ర నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సినిమాలు



పెద్దాపురం

లలితా స్క్రీన్-1:	మా నాన్న సూపర్ హీరో, విశ్వం
లలితా స్క్రీన్2:	దేవర పార్ట్-1
వీరభద్ర:	వేట్టయన్
శోభా:	జనక అయితే గనక
సామర్లకోట..	
అనుశ్రీ స్క్రీన్-1:	దేవర పార్ట్-1
అనుశ్రీ స్క్రీన్-2:	జనక అయితే గనక
విఘ్నేశ్వర:	విశ్వం, వేట్టయన్